
సాక్షి
పల్నాడు
మంగళవారం । 26 । నవంబర్ । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 585.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 10,000 క్యూసెక్కులు వదిలారు.



నాగాభరణం బహూకరణ

మేడికొండూరు: మందపాడు చెన్నమల్లేశ్వరస్వామి గుడికి తుమ్మల కుమారస్వామి, ఆదిలక్ష్మి దంపతులు నాగాభరణం, తుమ్మల సత్యనారాయణ భార్య జ్ఞాపకార్థం వెండి కిరీటాన్ని బహూకరించారు.

చంద్రికకు బంగారు పతకం



మంగళగిరి: పట్టణానికి చెందిన పవర్ లిఫ్టర్ బొల్లినేని చంద్రిక బంగారు పతకం సాధించింది. ఇటీవల సేలంలో జరిగిన పోటీలలో స్క్వాట్ 250 కేజీలు, బెంచ్ ప్రెస్ 110 కేజీలు, డెడ్ లిఫ్ట్ 200 కేజీలు కలిపి మొత్తం 560 కేజీలు బరువు ఎత్తి బంగారు పతకం సాధించింది.

నివేదన.. నిర్వేదం

బాధితులపైనే కేసు.. అయినా పట్టదా బాసూ



ఈ ఫొటోలో కనిపిస్తున్న యువకుడి పేరు యర్రగొర్ల నరసింహారావు. పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామం. ఈ ఏడాది సెప్టెంబర్ 9న లగడపాడులోని దళిత యువకులపై అగ్రవర్ణానికి చెందిన యువకులు కులం పేరుతో దూషిస్తూ దాడిచేశారు. దీనిపై కేసు నమోదైంది. అదే నెల 12న బాధితులు 17 మందిపై దాడిచేసిన యువకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమ కేసు నమోదు చేశారు. తమపై దాడిచేసి తిరిగి అక్రమ కేసు బనాయించడమేంటని దళిత యువకుడు యర్రగొర్ల నరసింహారావు, బాధితులు రెండు నెలలుగా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల చుట్టూ మూడు, నాలుగు సార్లు తిరిగి అర్జీలు పెట్టుకున్నారు. అర్జీని కలెక్టర్ ఎస్పీకి బదిలీ చేశారు, ఎస్పీ సత్తెనపల్లి డీఎస్పీకి ఫిర్యాదును బదిలీ చేశారు. కానీ ఇప్పటివరకు దళిత యువకులపై నమోదు చేసిన కేసును మాత్రం ఉపసంహరించలేదు. కనీసం ఫిర్యాదుకు ఎందుకు పరిష్కారం చూపడం లేదో కూడా తెలియడంలేదని నరసింహారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కూటమి ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పనితీరుకు అద్దం పట్టే ఘటన ఇది.

ఇలా బాధితులు విన్నవించే సమస్యలు ఎన్నో గాలిలో కలిసిపోతున్నాయి. చాలావరకు పరిష్కారం కావడం లేదు. ఫలితంగా ప్రతివారం జిల్లా కార్యాలయాలకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది.

పరిష్కారం కాని సమస్యలు

- కూటమి ప్రభుత్వం వచ్చాక అర్జీల రీఓపెన్
- ఐదు నెలల్లోనే 299 అర్జీలు రీ ఓపెన్
- పదేపదే తిరిగినా పరిష్కారం కాని వైనం
- ఇదీ జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదిక పనితీరు
- గత ప్రభుత్వంలో సచివాలయ సిబ్బందితో ప్రత్యేక కాల్ సెంటర్
- సమస్య పరిష్కారం అయ్యేవరకు పర్యవేక్షణ



కలెక్టరేట్‌లో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

సాక్షి, నరసరావుపేట: కూటమి ప్రభుత్వం ప్రతి సోమవారం కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక వల్ల ఫలితం ఉండడం లేదు. బాధితులకు న్యాయం జరగడం లేదు. పైగా అర్జీదారులను అధికారులు పదేపదే తిప్పుకుంటున్నారు. ఫలితంగా వ్యయప్రయాసలు భరించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా ఫిర్యాదులకు నిర్ణయించిన గడువులోగా పరిష్కారం చూపకపోవడంతో అవి రీఓపెన్ అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈఏడాది జూన్ 15 నుంచి ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలో సుమారు 3,200 ఫిర్యాదులు అందగా అందులో 527 పరిశీలనలో ఉన్నాయి. 2,373 ఫిర్యాదులకు పరిష్కారం చూపగా, 299 రీఓపెన్ అయ్యాయి. ఇందులో అత్యధికంగా రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించినవే ఉన్నాయి. కలెక్టర్ అరుణ్‌బాబు ఫిర్యాదుల రీఓపెన్‌పై ప్రతి సోమవారం సమీక్షలు నిర్వహిస్తున్నా.. పరిస్థితిలో మార్పు రావడం లేదు.

రీ ఓపెన్ కాకుండా చర్యలు

జిల్లా, మండల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నాం. ప్రజల ఫిర్యాదులు రీఓపెన్ కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపుతున్నాం.

– అరుణ్‌బాబు, కలెక్టర్, పల్నాడు

ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూంతో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం ద్వారా 'స్పందన' ఫిర్యాదుల పరిష్కారాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించేవారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఫిర్యాదుదారు, అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యే వరకు పనిచేసేవారు. దీనివల్ల ఫిర్యాదుదారులకు సత్వరమే సమస్య పరిష్కారం కాకపోవడానికి గల కారణాలు తెలిసేవి. కొత్త ప్రభుత్వం వచ్చాక కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూంకు స్వస్తిపలికారు. ప్రస్తుతం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సిబ్బంది, ప్రత్యేకాధికారులు ఈ పనిచేస్తున్నా గతంలోలాగా పారదర్శకత ఉండటం లేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

కత్వ చెరువు ఆక్రమణలపై పట్టించుకోవట్లేదు



నరసరావుపేట పట్టణంలోని కత్వ చెరువుకు చెందిన 70 ఎకరాల్లో 20 ఎకరాలను ఆక్రమించి అపార్టుమెంట్లు నిర్మాణం చేస్తున్నారు. గతనెల 10న కలెక్టరేట్, ఆర్డీఓ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాం. ఇప్పటివరకు పట్టించుకోలేదు. మళ్లీ మరోసారి చేస్తున్నాం. అధికారుల అలసత్వం మంచిది కాదు.

– షేక్ కరీముల్లా, ఎంఐఎం నాయకుడు, కూచిపూడి చంద్రశేఖర్, వీసీఎఫ్ పార్టీ నాయకుడు

అధికారులు తప్పించుకుంటున్నారు



మాకు రూపెనగుంట్లలో ఐదు ఎకరాల పొలం ఉంది. రావిపాడు నుంచి పొలానికి వెళ్లాల్సి ఉంది. మధ్యలో దారిలేదు. ఆ దారి నీటితో నిండిపోయి ఉంటుంది. బ్రిడ్జి నిర్మించాలని గత నెలలో ఒకసారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదుచేయండి అని చెప్పారు. తీరా అక్కడికి పోతే ఎన్ఎస్పీ అధికారులకు ఫిర్యాదు చేయమని చెబుతున్నారు. ఫిర్యాదు ఎవరికి చేయాలో తేల్చుకోవడానికే ఇంత సమయం పడితే, ఫిర్యాదు పరిష్కారం ఎంత సమయం పడుతుందో.

– పాగిలి శ్రీనివాసరావు, రామకృష్ణ, తండ్రీ కుమారులు, బరంపేట, నరసరావుపేట

నేను చనిపోయానని ఆస్తి కాజేశారు



నాకు ఒక అబ్బాయి, ఇద్దరు కుమార్తెలు, నా కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె నేను చనిపోయినట్లుగా ధ్రువపత్రం సృష్టించి నా ఆస్తి కాజేసి నన్ను రోడ్డుపైకి నెట్టారు. ఫిర్యాదుచేసినా పట్టించుకోవట్లేదు. మరోసారి ఎస్పీకి ఫిర్యాదుచేద్దామని వచ్చా.

– గోపిదేశి కోటేశ్వరమ్మ, చిలకలూరిపేట

వైభవంగా లక్ష దీపోత్సవం



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలో కార్తిక సోమవారం లక్ష దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారి ఎదురుగా వేదపండితులు వేద మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు భగన్నామ సంకీర్తనలు, మేళతాళాల నడుమ లక్ష దీపోత్సవాన్ని ప్రారంభించారు. మహిళలు లక్ష దీపాలను వెలిగించారు. దీపకాంతులతో దేవాలయం కొత్త శోభను సంతరించుకొంది. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పల్నాటి ఉత్సవాలు జయప్రదం చేద్దాం

మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలకు వచ్చే వీరాచారులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యమూ కలుగకుండా అన్ని వసతులూ కల్పించడానికి అధికారులు, నాయకులు సమన్వయంతో పని చేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉత్సవ ఏర్పాట్లపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. నాగులేరు నీరు మరింత పరిశుభ్రంగా ఉండేందుకు సాగర్ కుడి కాల్వ నీటిని ఎస్కేప్ చానల్ ద్వారా విడుదల చేయాలని ఎన్ఎస్‌పీ అధికారులను ఆదేశించారు. సరిపడినన్ని మరుగుదొడ్లు నిర్మించాలని సూచించారు. పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. ఉత్సవాల ప్రారంభ తేదీ ఈనెల 30 నుంచి ముగిసే తేదీ 4 వరకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణపైనా దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వాసు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపు యూపీపీఎస్సీ ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్ష

నెహ్రూనగర్: యూపీపీఎస్సీ ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్షను ఈ నెల 27న గుంటూరు నగరంలోని బీసీ స్టడీ సర్కిల్(రాజాగారితోట)లో నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి మయూరి సోమవారం తెలియజేశారు. ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఒంగోలు జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఉదయం 10.30గంటలకు బీసీ స్టడీ సర్కిల్‌కు వద్ద హాజరుకావాలని ఆమె సూచించారు.

ఏఎస్‌ఐలకు ఉద్యోగోన్నతి పరీక్షలు



నగరంపాలెం: ఏఎస్ఐ నుంచి ఎస్ఐ ఉద్యోగోన్నతి కోసం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో సోమవారం రాత పరీక్ష నిర్వహించారు. రాత పరీక్షలను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పర్యవేక్షించారు. గుంటూరు రేంజ్‌లోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లాలో విధులు నిర్వర్తించే 51 మంది పురుషులు, ఏడుగురు మహిళా ఏఎస్ఐలు పరీక్షలకు హాజరయ్యారు. ఒంగోలు పోలీస్ శిక్షణా కళాశాల ప్రిన్సిపల్ కమాండెంట్ ఎస్పీ నగేష్ బాబు, ప్రకాశం జిల్లా ఏఎస్పీ (పరిపాలన) నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఏఎన్‌యూ: దక్షిణ, పశ్చిమ మండలాల(జోన్స్) అంతర్ విశ్వవిద్యాలయాల స్త్రీ, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ మంగళవారం నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగుతాయని పోటీల నిర్వాహక కార్యదర్శి, ఏఎన్‌యూ వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ తెలిపారు. పోటీలకు వివరాలను సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. మహిళల కేటగిరీ పోటీలు మంగళవారం నుంచి 28 వరకు, పురుషులకు ఈనెల 30వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో 125 విశ్వవిద్యాలయాల నుంచి వెయిట్ లిఫ్టర్లు హాజరుకానున్నారని తెలిపారు. మంగళవారం జరిగే పోటీల ప్రారంభోత్సవ సభకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, ప్రత్యేక ఆహ్వానితులుగా అర్జున అవార్డు గ్రహీత నీలం శెట్టి లక్ష్మి, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకటరామయ్య, యూనివర్సిటీ అధికారులు, టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారని తెలిపారు. పోటీలకు వీసీ ఆచార్య కె గంగాధరరావు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా ఉన్నారని పాల్ కుమార్ తెలిపారు.

పవర్ లిఫ్టింగ్‌లో షబీనాకు బంగారు పతకం



తెనాలి: పట్టణానికి చెందిన పవర్ లిఫ్టర్ షేక్ షబీనా మరో విజయం సాధించింది. సదరన్ రైల్వే, సేలమ్ డివిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం సేలంలో నిర్వహించిన సౌతిండియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో 84 కిలోల విభాగంలో తలపడిన షబీనా, స్క్వాట్‌లో 190 కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 90 కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 180 కిలోల చొప్పున మొత్తం 460 కిలోల బరువులనెత్తి, ఓవరాల్‌గా ఈ విజయాన్ని అందుకుంది.

జగ్జీవన్‌రామ్ చైర్‌ను సందర్శించిన లిడ్‌క్యాప్ చైర్మన్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బాబూ జగ్జీవన్‌రామ్ చైర్‌ను సోమవారం ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యారావు సందర్శించారు. చైర్ ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యలను డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా మాణిక్యారావు మాట్లాడుతూ చైర్ అభివృద్ధికి లిడ్‌క్యాప్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. చైర్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించాలని కోరారు. అనంతరం వీసీ కె.గంగాధరరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న వలంటీర్లు, నాయకులు

- కలెక్టరేట్ వద్ద ధర్నా
- జేసీకి వినతిపత్రం

నరసరావుపేట: ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను విధుల్లోకి తీసుకుని వారి బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ హుమాయిస్‌బాష ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రైల్వే స్టేషన్ గేటు వద్ద నుంచి కలెక్టరేట్ వరకు వలంటీర్లతో ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం జేసీ సూరజ్ గనోరేకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2.60 లక్షల మంది వలంటీర్లు, వారి కుటుంబ సభ్యులతో విజయవాడలో మహాధర్నా చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు సేవచేయటమే వలంటీర్లు చేసిన నేరమా అని ప్రశ్నించారు. మంత్రి డోలా వీరాంజనేయులు శాసన మండలిలో చేసిన ప్రకటన మోసపూరితమని ఖండించారు. వలంటీర్లను విధుల్లోకి తీసుకోకుంటే వారే భవిష్యత్తులో ప్రభుత్వానికి ఉరితాళ్లుగా మారతారని హెచ్చరించారు. వలంటీర్లకు మద్దతు పలికిన సోషల్ యాక్టివిస్ట్, ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల సంఘ రాష్ట్ర గౌరవ సలహాదారు ఈదర గోపీచంద్ మాట్లాడుతూ 'ఓటిచ్చునప్పుడే ఉండాలి బుద్ధి' అని ప్రముఖ ప్రజాకవి కాళోజి ప్రబోధించినట్లే చంద్రబాబు లాంటి రాజకీయవేత్తలు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చేటప్పుడే బాధ్యత–భయం గుర్తెరగాలని అన్నారు. గెలిచి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీల మేనిఫెస్టోను చూస్తేనే తనకు భయమేస్తోంది అనే మోసపూరిత మాటలు మాట్లాడటం దగాకోరుతనమని విమర్శించారు. కార్యక్రమంలో వలంటీర్లు ఎల్.సురేష్, షేక్ యాసిన్, షేక్ గౌస్, మాలతి, మధుబాల, షాబీరా, ఉమామహేశ్వరి, సుబ్బారావు, పెదలక్ష్మయ్య పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఖోఖో



ప్రథమ స్థానం సాధించిన గుంటూరు జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

- బాలుర విభాగం విజేత గుంటూరు
- బాలికల విభాగం విజేత చిత్తూరు

కారెంపూడి: అంతర జిల్లాల అండర్ 14 బాల, బాలికల ఖోఖో క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. బాలుర విభాగంలో గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రకాశం జిల్లా జట్టు ద్వితీయ స్థానాన్ని, చిత్తూరు జిల్లా జట్టు తృతీయ స్థానాన్ని పొందాయి. బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించింది. శ్రీకాకుళం జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో, విశాఖపట్నం జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విజేతలకు ట్రోఫీలను, బహుమతులను ప్రదానం చేశారు. గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ సరస్వతీభాయి, విద్యా కమిటీ చైర్మన్ బాలునాయక్, జిల్లా స్పోర్ట్స్ సెక్రటరీ సురేష్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వర్ణరాజు, శ్రీనివాసరావు, చినరత్తయ్య, చిరంజీవిరావు, రాధాకృష్ణమూర్తి, కాశేశ్వరరావు, ప్రసాద్‌లతో పాటు ఉమ్మడి జిల్లాలోని పీఈటీలందరూ పోటీల నిర్వహణలో పాల్గొన్నారు.

యానిమేటర్లపై కక్ష సాధింపు

- అధికారం లేకపోయినా తొలగింపులు
- కొద్దిమంది అవినీతిని అందరికీ అంటగట్టి దురాగతం
- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు
- కోర్టును ఆశ్రయించిన యానిమేటర్లు
- నిరసన బాటలో చిరుద్యోగులు



ఇటీవల పల్నాడు జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న యానిమేటర్లు

అమరావతి: కూటమి ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు సేవలందించే యానిమేటర్లపై కక్ష సాధింపు చర్యలకు దిగింది. ఇష్టారాజ్యంగా తొలగింపులకు పూనుకుంటోంది. ఇప్పటివరకు పల్నాడు జిల్లాలోని 28 మండలాల్లో ఉన్న యానిమేటర్లను ఓ రాజకీయ పార్టీతో సంబంధాలు ఉన్నాయంటూ తొలగించారు. పల్నాడు జిల్లాలో సుమారు వెయ్యిమందికిపైగా యానిమేటర్లు 15 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. వీరు ప్రభుత్వం ఇచ్చే అతితక్కువ వేతనంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇప్పుడు ఏదో సాకుతో విధుల్లో నుంచి తొలగించడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో డ్వాక్రా గ్రూపుల మహిళలకు తీర్మానాలు చేయటం, రికార్డు రాయటం, అలాగే ఖాతా పుస్తకాలు అనుసరించి సంఘాల రికార్డులలో ఎప్పటిప్పుడు నమోదు చేయటం యానిమేటర్ల విధి. సంఘ సభ్యులకు మండల వెలుగు కార్యాలయానికి అనుసంధానంగా వీరు పనిచేస్తారు. రుణాల మంజూరులో కీలకంగా వ్యవహరిస్తారు. వీరిని నియమించే అధికారం, తొలగించే అధికారం ప్రభుత్వానికి లేదు. గ్రామంలోని సుమారు 20 నుంచి 30 గ్రూపులలోని మహిళలంతా కలిసి తమకు అనుకూలంగా ఉన్న అదే గ్రామానికి చెందిన మహిళను యానిమేటర్‌గా నియమించుకుంటారు. ఇదే పద్ధతిన తొలగిస్తారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తమకు అనుకూలంకాని యానిమేటర్లపై కక్షగట్టి తమ పార్టీ అనుకూల సంఘాలతో సమావేశం పెట్టి తొలగింపులకు పాల్పడుతోంది. అదేమని అడిగితే అవినీతిని అంటగడుతున్నారు. ఎక్కడైనా ఒకరిద్దరు యానిమేటర్లు గ్రూపుల ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలకు పాల్పడితే ఆ నెపం అందరిపైనా వేస్తున్నారు.

కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చినా..

పెదకూరపాడు నియోజవకర్గంలో తొలగింపులు అధికంగా ఉండడంతో యానిమేటర్లు కోర్టును ఆశ్రయించారు. ఈ నియోజవర్గంలో ఐదు మండలాలు ఉండగా 181 మంది యానిమేటర్లు ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఐదు నెలల కాలంలో 94 మందిని తొలగించినట్లు సమాచారం. అందులో 52 మంది కోర్టును ఆశ్రయించారు. కోర్టు గ్రామ సమైక్య సంఘాల కార్యక్రలాపాలలో డీఆర్డీఏ అధికారులు జోక్యం చేసుకోరాదని, యానిమేటర్లను గతంలో ఉన్న విధంగా యథాస్థితిగా కొనసాగించాలని తీర్పు ఇచ్చింది. అయినా అధికారుల్లో మార్పురాలేదు. దీంతో యానిమేటర్లు సీపీఎం అనుబంధ సంస్థ సీఐటీయూతో కలిసి ఆందోళన బాటపట్టారు. ఇటీవల పల్నాడు కలెక్టరేట్ వద్ద నిరసన ధర్నా చేపట్టారు. ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందించారు.

రాజకీయాలు సరికాదు



మహిళలు సమైక్యంగా పనిచేసుకునే వెలుగు విభాగంలో రాజకీయాలు చొప్పించటం సరికాదు. రాజకీయ ఒత్తిళ్లతో ఎన్నోఏళ్లుగా పనిచేస్తున్న యానిమేటర్లను తొలగించటం అన్యాయం.

– గుంటూరు కుమారి, మండల సమైక్య సంఘం మాజీ అధ్యక్షురాలు, అమరావతి

వెంటనే విధుల్లోకి తీసుకోవాలి



రాజకీయ కక్ష సాధింపుతో యానిమేటర్లను తొలగించడం అన్యాయం. కోర్టు తీర్పునూ గౌరవించకపోవడం దుర్మార్గం. వెంటనే యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలి. అధికారులు ధర్మబద్ధంగా నడుచుకోవాలి. లేకుంటే రాష్ట్ర వ్యాప్త నిరసన చేపడతాం.

– ఆంజనేయ నాయక్, సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి

గ్రామ సమైక్యల నిర్ణయాలే అమలు

గ్రామ సమైక్య సంఘాల నుంచి వచ్చిన నిర్ణయాలనే అమలు చేస్తున్నాం. కోర్టు ఉత్తర్వుల మేరకు మండల వెలుగు సిబ్బంది ఎవరుకూడా గ్రామ సమైక్య సంఘాల కార్యకలాపాలలో జోక్యం చేసుకోవటం లేదు. యానిమేటర్లు విషయంలో గ్రామ సమైక్య సంఘాల తీర్మానాలు అనుసరించి నిర్ణయం తీసుకుంటున్నాం.

– ఎవ్.వి.కృష్ణప్రియ, ఏపీఎం, వెలుగు కార్యాలయం అమరావతి

హరోం హర



కోటప్పకొండలో త్రికోటేశ్వర స్వామికి పుష్పాలంకరణ



అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు

-8లో

అమరావతిలో ప్రణవనాదం



కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



విశేష అలంకారంలో అమరేశ్వరుడు

క్లుప్తంగా

అంగన్‌వాడీలపై దాడులను నివారించాలి



ఎస్పీని కలిసి ఫిర్యాదుచేస్తున్న అంగన్‌వాడీ నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం వచ్చాక అంగన్‌వాడీలపై జరుగుతున్న దాడులను నివారించి వారికి రక్షణ కల్పించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావును కలిసి విన్నవించారు. ఇప్పటి వరకు బెదిరించి 15 మంది అంగన్‌వాడీలచే బలవంతంగా రాజీనామాలు చేయించారన్నారు. రాజీనామాలు చేయనివారిపై భౌతిక దాడులకు పాల్పడ్డారన్నారు. బెల్లంకొండ మండలం మన్నెసుల్తాన్ పాలెంకు చెందిన మాటూరి బుజ్జి, దుర్గి మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన మాగులూరి పిచ్చమ్మపై అధికార పార్టీ నాయకులు దాడులు చేసి బెదిరించారని, అయితే వారు రాజీనామా చేయకపోతే భర్త, పిల్లలపై భౌతిక దాడులకు పాల్పడ్డారన్నారు. ఇప్పటికైనా జరిగిన ఘటనలపై విచారణ చేసి దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి శిక్షించాలని, భవిష్యత్‌లో దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావును కోరారు. జిల్లా అధ్యక్షురాలు కేపీజే మెటిల్డాదేవి, జిల్లా కార్యదర్శి ఎల్.మార్తేశ్వరి, ఎస్.ఆంజనేయనాయక్ పాల్గొన్నారు.

సంకట హరణ నమో..!



సత్రశాల దేవస్థానంలో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన మల్లికార్జునస్వామి



పూలతో ఏర్పాటు చేసిన శివలింగాకారం



సత్రశాల దేవస్థానం ఆవరణలో భక్తులకు అన్నదానం

రెంటచింతల: కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం పరమేశ్వరుని నామస్మరణతో మార్మోగింది. దేవస్థానం సమీపంలోని పవిత్ర కృష్ణానదిలో వేకువజాము నుంచే భక్తులు కార్తిక దీపాలు వెలిగించి పుణ్యస్నానాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అర్చకులు మల్లికార్జునశర్మ నేతృత్వంలో స్వామివార్లకు పూజలు, అభిషేకాలు, గణపతి, రుద్ర హోమాలు నిర్వహించారు. గోలి సర్పంచ్ మున్నా చంద్రం, ప్రభావతి దంపతులు వారి కుటుంబ సభ్యులు వేలాది మంది భక్తులకు, వివిధ స్వామి మాలలు స్వీకరించిన మాలధారులకు అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణంలో పూలతో తీర్చిదిద్దిన శివలింగాకారం భక్తులను ఆకట్టుకుంది. ఈఓ గాదె రామిరెడ్డి, అన్నదాన కమిటీ సభ్యులు గొట్టం శ్రీనివాసరెడ్డి, మున్నా ప్రభురాజు, నీలం మల్లయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆడపిల్ల పుట్టిందని కొట్టి చంపబోయారు

- ఎస్పీకి ఓ మహిళ ఫిర్యాదు
- పోలీస్ గ్రీవెన్స్‌కు 50 ఫిర్యాదులు
- అర్జీలు స్వీకరించిన ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట: 'భర్త చనిపోయాడు. సొంత కూతురిలా చూడాల్సిన అత్తమామలు, భర్త తరపు బంధువులు ఆడపిల్ల పుట్టిందని నన్ను చంపబోయారు. నా తల్లిదండ్రులు పుట్టింటికి తీసుకొచ్చి సంరక్షించారు' అని ఓ మహిళ జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేసింది. పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎస్పీ అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 50 ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం ఎస్పీ ఫిర్యాదులను సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపి పరిష్కరించాలని ఆదేశించారు.



ఎస్పీకి సమస్య చెప్పుకుంటున్న బాధితులు

అత్తమామల నుంచి రక్షించండి

ఐదేళ్ల క్రితం ఒంగోలు వాసితో నాకు పెళ్లయింది. మూడు నెలల గర్భవతిగా ఉన్నప్పుడు భర్త చనిపోయాడు. ఆ సమయంలో అత్తమామలు, భర్త తరపు కుటుంబ సభ్యులు బాగా చూసుకుంటామని నమ్మించారు. తీరా ఆడపిల్ల పుట్టిన తర్వాత భర్త బంధువులు అందరూ నన్ను కొట్టి చంపబోయారు. తల్లిదండ్రులు తమ వద్దకు తీసుకెళ్లి నా సంరక్షణ చూస్తున్నారు. అత్తమామలపై చర్యలు తీసుకొని న్యాయం చేయండి.

– నాజెండ్ల నాగసాయిరజని, వరవకట్ట, నరసరావుపేట

మిర్చి తీసుకొని డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారు

మేము గుంటూరు శ్రీ విజయ భాస్కర్ ట్రేడర్స్‌కు 640 ఎండుమిర్చి బస్తాలు విక్రయించాం. వాటి విలువ సుమారు రూ.42.65 లక్షలు. డబ్బులు కోసం ఎంత తిరిగినా ఇవ్వట్లేదు. మాకు న్యాయం చేయండి.

– రైతులు, ఇర్లపాడు, నాదెండ్ల మండలం

ప్రహరీ పడగొట్టారు

నేను 1970లో మాచర్ల పట్టణంలోని కోర్టు వెనుక వైపున తొమ్మిది సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి చుట్టూ ప్రహరీ నిర్మించాను. ఈనెల 19న బాబు, సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి స్థలానికి ఉన్న ప్రహరీని పడగొట్టారు. వారిపై చర్యలు తీసుకొని నాకు నష్టపరిహారం ఇప్పించండి.

– మేకల సత్యవతి, నరసరావుపేట

ఆర్టీసీ బస్సులో బంగారం పోయినా కేసు నమోదు చేయలేదు

నేను ఈ ఏడాది మార్చి 15న ఒంగోలు వెళ్ళుటకు వినుకొండ బస్టాండ్‌లో ఒంగోలు బస్సు ఎక్కాను. శివయ్య స్థూపం వద్ద ఒక అమ్మాయి, అబ్బాయి బస్సు ఎక్కి వినుకొండలోని కోటప్పనగర్‌లో దిగారు. కొంతసేపటి తరువాత బ్యాగ్ చూసుకోగా కట్‌చేసి బ్యాగ్‌లో ఉన్న బంగారు వస్తువులు ఉంచిన బాక్స్ పోయింది. కోటప్పనగర్‌లో దిగిన అమ్మాయి అబ్బాయి మీద అనుమానం ఉంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదుచేయలేదు.

– ఆవుల ఇందిరాదేవి, వినుకొండ

రుణం తీసుకుని ఇవ్వడం లేదు

నా భర్త గోపి, ప్రదీప్ ఇద్దరు కలిసి గ్రిల్ నైట్స్ అనే హోటల్‌ను రూ.5లక్షల రుణం తీసుకొని పెట్టారు. వ్యాపారం సరిగ్గా నడవక హోటల్ తీసివేశారు. ఇప్పుడు లోన్ అమౌంట్ ఇవ్వకుండా ప్రదీప్ ఇబ్బంది పెడుతున్నాడు. అడిగితే నాపైన, నా భర్త పైన ఎస్సీ ఎస్టీ కేసు పెడతానని బెదిరిస్తున్నాడు.

– గుర్రపుశాల సాయి దుర్గ, నరసరావుపేట

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

నా కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని నాగేశ్వరరావు అనే వ్యక్తి రూ.2.30 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించలేదు. డబ్బులు తిరిగి ఇవ్వలేదు. మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకొని నా డబ్బులు ఇప్పించండి.

– మన్నెపల్లి బ్రహ్మయ్య, రావిపాడు, నరసరావుపేట మండలం

బురిడీ కొట్టించి రూ.లక్ష కాజేశారు

నా సొంత మేనల్లుడు నాగేశ్వరరావులాగా అపరిచిత వ్యక్తి ఫోన్లో మాట్లాడి రూ.లక్ష ఫోన్‌పే చేయించుకున్నాడు. నమ్మించి మోసం చేసిన సదరు వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకొని నా డబ్బులు ఇప్పించండి.

– రాచమల్లు వెంకట శివరామకృష్ణప్రసాదు, చిలకలూరిపేట

చిట్టీ డబ్బులు ఇవ్వడం లేదు

పులుకూరి లక్ష్మీ వద్ద చిట్టి వేశాను. రూ.లక్ష ఇవ్వాల్సి ఉండగా ఆమె ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోంది. నేనే ఆమెకు రూ.4 లక్షలు ఇవ్వాలని బెదిరిస్తోంది. ఆమెపై చర్యలు తీసుకుని నాకు న్యాయం చేయండి.

– షేక్ మస్తానబీ, పిడుగురాళ్ల

ప్రతి ఫిర్యాదూ పరిష్కారం కావాలి

జాయింట్ కలెక్టర్ సూరజ్

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి ఫిర్యాదూ పరిష్కారం కావాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన అర్జీలు స్వీకరించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన 34 మంది తమ వినతులను అందించారు. జేసీ మాట్లాడుతూ అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి మురళి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ సూరజ్

డైవర్షన్ చానల్ పునరుద్ధరించండి

వారం రోజుల క్రితం పొలాలకు నీరు వచ్చే కాలువకు ఉన్న డైవర్షన్ చానల్‌ను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పూడ్చివేశారు. దీంతో నీరు నిలబడి పంటలు పాడై పోతున్నాయి. వెంటనే ఆ చానల్‌ను పునరుద్ధరించండి.

– వి.తిరుపతయ్య, అంచులవారిపాలెం, రాజుపాలెం మండలం

ఆధ్యాత్మికం విరాజిల్లే చోట సుఖశాంతులు

- ద్విరాష్ట్ర వేద పండిత సంఘ అధ్యక్షులు రాజాస్వామినాథ గురుకుల్
- యడ్లపాడు గ్రామాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు
- గ్రామస్తులకు ఆశీస్సులు

యడ్లపాడు: ఆధ్మాతికం ఎక్కడ విరాజిల్లుతుందో ఆ ప్రాంతం సుభిక్షంగానూ, అక్కడి ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లుతారని ద్విరాష్ట్ర (తమిళనాడు, పాండిచ్చేరి) వేద పండిత సంఘ అధ్యక్షులు రాజాస్వామినాథ గురుకుల్ తెలిపారు. కేంద్రపాలిత ప్రాంత పుదుచ్చేరిలోని కారైకల్ జిల్లా తిరునల్లార్ గ్రామంలో శనీశ్వరన్ ఆలయంగా ప్రసిద్ధి చెందిన దర్భణేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులుగా వ్యవహరిస్తున్న ఆయన గుంటూరు జిల్లాలోని ఓ కృష్ణమందిరం నిర్మాణ పనులు విషయమై వెళ్తూ సోమవారం యడ్లపాడు గ్రామాన్ని సందర్శించారు. హైదరాబాద్ పుడమి బిల్డర్ అధినేత ముత్తవరపు సురేష్‌బాబు ఆహ్వానం మేరకు గ్రామానికి విచ్చేసిన రాజాస్వామినాథ గురుకుల్ బృందానికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. పండితుల వేదమంత్రోచ్చరణల మధ్య మేళతాళలతో పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. స్థానికంగా పూజలు నిర్వహించి గ్రామస్తులకు ఆశీర్వచనాలు ఇచ్చారు. నియోజకవర్గంలో అనేక పురాతన ఆలయాలు ఉన్నాయని, అవన్నీ పూర్వవైభవాన్ని సంతరించుకోవాలని, ఈ ప్రాంతంలో ఆధ్మాత్మిక అభివృద్ధి జరిగి ప్రజలకు ఆనందభరిత జీవితాన్ని ప్రసాదించాలని కోరారు. అనంతరం పలు రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు, అరుణకుమారి దంపతులు రాజాస్వామినాథ గురుకుల్, మహాలింగ గురుకుల్‌లను సత్కరించారు. కార్యక్రమంలో యడ్లపాడు శివాలయం అభివృద్ధి కమిటీ శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, రామసుబ్బారావు, గ్రామపెద్దలు ముత్తవరపు రామారావు, రవీంద్ర, మాధవరావు ఉన్నారు.



రాజాస్వామినాథ గురుకుల్ పీఠాధిపతి బృందానికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

చెప్పినట్టు చేయకుంటే రీచ్‌ను అడ్డుకుంటా

అంబడిపూడిపూడి ఇసుక రీచ్ నిర్వాహకులకు ఓ దినపత్రిక క్రైం రిపోర్టర్ బెదిరింపు

అచ్చంపేట: 'ఇసుక రీచ్‌లలో నేను చెప్పింది చేయండి.. లేకుంటే మీ రీచ్ ఏవిధంగా నిర్వహిస్తారో నేనూ చూస్తానంటూ ఓ దినపత్రికలో పనిచేస్తున్న క్రైం రిపోర్టర్, అతని అనుచరుడు బెదిరించి, రీచ్ నిర్వహణకు అంతరాయం కలిగించారంటూ అంబడిపూడి-1 ఇసుక రీచ్ సూపర్‌వైజర్ యడ్లపల్లి బుచ్చిబాబు సోమవారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం.. ఈనెల 22న ఏపీ07 టీజే0678 అనే నంబరు గల లారీని కోనూరు గ్రామానికి చెందిన ఆటో శ్రీను కుమారుడు సురేష్ వేగంగా నడుపుకుంటూ రీచ్ వద్దకు వచ్చాడు. 'మా లారీ ఓనర్ నాకు ఉచితంగా ఇసుక లోడ్ చేయమన్నాడు, చేస్తావా లేదా' అని బెదిరించాడు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధర చెల్లిస్తే లోడ్ చేస్తానని సుపర్‌వైజర్ బుచ్చిబాబు చెప్పడంతో ధర చెల్లించాడు. కొద్దిసేపటి తరువాత లారీ తీసుకుని వచ్చి 'మా ఓనర్ నాకు ఉచితంగా ఇసుకను పోయమన్నాడు. నేను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలి' అని అడిగాడు. అలా కుదరదని చెప్పడంతో సురేష్ ఘర్షణకు దిగాడు. లారీని దారికి అడ్డంగా పెట్టి మిగిలిన లారీలు, ట్రాక్టర్ల రాకపోకలకు అంతరాయం కలిగించాడు. ఇంతలో సురేష్ మా ఓనర్‌తో మాట్లాడాలని ఫోను బుచ్చిబాబుకు ఇచ్చాడు. అవతలి వ్యక్తి 'నేను క్రైమ్ రిపోర్టర్‌ను.. పల్నాడు జిల్లాలో నేను చెప్పినట్లుగా రీచ్ నిర్వాహకులు నడుచుకోవాలి, మీరు ఏవిధంగా రీచ్‌ని కొనసాగిస్తారో చూస్తా' అంటూ బెదిరించాడు. ఈ మేరకు సూపర్‌వైజర్ బుచ్చిబాబు ఫిర్యాదు మేరకు సీఐ వెంకటప్రసాద్ రిపోర్టర్, లారీ డ్రైవర్‌లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

హరోం హర

కోటప్పకొండకు పోటెత్తిన భక్తులు

నరసరావుపేట రూరల్: పవిత్ర కార్తికమాసం చివరి సోమవారం కావడంతో ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ భక్తులతో పోటెత్తింది. త్రికోటేశ్వర స్వామి దర్శనానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు స్వామికి విశేష ద్రవ్యాలు, పంచామృతాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో స్వామిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అయ్యప్ప మాలధారులు నిద్ర చేసి ఉదయం తొలిపూజలో పాల్గొన్నారు. మాలధారులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకున్నారు. శరణు ఘోషతో ఆలయం మార్మోగింది. అభిషేక మండపంలో నిర్వహించిన ప్రత్యేక అభిషేకాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అభిషేక దర్శనంతోపాటు ప్రత్యేక, శీఘ్ర, ఉచిత దర్శనం ద్వారా భక్తులకు దర్శనం కల్పించారు. ఉచిత దర్శనంలో భక్తుల రద్దీ నెలకొంది. మహిళలు రావిచెట్టు, మహానందీశ్వరుడి వద్ద కార్తిక దీపాలు వెలిగించారు. ధ్యానశివుడు, నాగేంద్రుని పుట్ట పూజలు నిర్వహించారు. త్రిముఖ శివలింగం వద్ద యాత్రికులు సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. సోపానమార్గం నుంచి మెట్ల పూజ చేస్తూ భక్తులు కొండపైకి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ డి.చంద్రశేఖరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కొండపైన పార్కింగ్ స్థలం వాహనాలతో నిండిపోయింది. దీంతో ఘాట్‌రోడ్డు ద్వారా వచ్చే వాహనాలను నియంత్రించారు. రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐ కిశోర్‌లు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఘాట్‌రోడ్డులోని ప్రకృతి పర్యావరణ కేంద్రంలో యాత్రికులు సందడి చేశారు.

అమరావతిలో ప్రణవనాదం

అమరావతి: ప్రథమ పంచారామం అమరావతి బాల చాముండికా సమేత అమరేశ్వరాలయం కార్తికమాస ఆఖరి సోమవారం ప్రణవనాదంతో ప్రతిధ్వనించింది. వేకువజామునే భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయంలోని ఉసిరిక చెట్టు వద్ద దీపారాధనలు చేశారు. ఓం నమశివాయః అంటూ నినదించారు. ఆలయ అర్చకస్వాములు మూడు గంటలకు భక్తుల పరోక్షంలో కార్తికమాస అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు. అభిషేకాలతో పాటు అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. వేకువనే సుమారు వంద బస్సుల్లో భక్తులు రావడంతో ఆలయం రద్దీగా మారింది. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ కార్తిక సోమవారం ప్రాముఖ్యాన్ని వివరించారు. సోమవారం ఆలయాన్ని సుమారు 20వేల మంది భక్తులు సందర్శించినట్లు అంచనా వేస్తున్నారు. సత్తెన పల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఓబీసీ జన గణన చేయాలి



నరసరావుపేట: జనగణనతో పాటుగా సమగ్ర ఓబీసీ జన గణన చేపట్టి తద్వారా రాష్ట్రంలో ఉన్న అన్ని బీసీ కులాలకు న్యాయంచేయాలని బీసీ సంక్షేమ సంఘ నాయకులు కోరారు. సోమవారం ఓబీసీ జన గణన చేపట్టాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద కొద్దిసేపు ధర్నా నిర్వహించి జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షులు యామా మురళి మాట్లాడుతూ బీసీలకు సామాజికంగా, ఆర్థిక రాజకీయ రంగాలలో పెద్ద పీట వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బాదుగునల శ్రీను, పలు నియోజకవర్గాల అధ్యక్షులు యడవల్లి కొండల గౌడ్, కాకుమాను రమేష్, షేక్ సిద్దయ్య, భీమవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాకు పీఎఫ్ సౌకర్యం కల్పించండి

గుంటూరు వెస్ట్ సుమారు 30 సంవత్సరాలు నిస్వార్థ సేవ చేసినందుకు తమకు న్యాయం చేయాలని వీఆర్వో (గ్రామ పునర్ నిర్మాణ సంస్థ) ఉద్యోగులు డిమాండ్‌చేశారు. సోమవారం గుంటూరు కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. వీఆర్వో సంస్థ గ్రామాభివృద్ధితోపాటు విద్యా వికాసానికి కృషి చేశామని చెప్పారు. జిల్లాలో సుమారు 1500 మంది ఉన్నారని వారందరికీ ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించాలని సంస్థ సభ్యుడు టి.మహతి తదితరులు విజ్ఞప్తి చేశారు.

విలువలతో కూడిన విద్య అందించాలి

దాచేపల్లి : విలువలతో కూడిన విద్య అందించాలని సత్తెనపల్లి డెప్యూటీ డీఈఓ ఏసుబాబు అన్నారు. కాట్రపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులతో మాట్లాడి విద్య బోధనపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి శ్రద్ధతో చదువుకోవాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం పనితీరును పరిశీలించారు. ప్రస్తుతం ఏజెన్సీ నిర్వాహకులను తొలగించాలని స్థానిక టీడీపీ నాయకులు ఒత్తిడి చేశారు. దీంతో డెప్యూటీ డీఈఓ, స్థానిక ఎంఈఓ పినాకపాణి ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న రాజకీయ కారణాలతో తాము విధుల నుంచి తప్పుకుంటామని ఏజెన్సీ నిర్వాహకులు అంగీకరించారు. డెప్యూటీ డీఈఓ వెంట హెచ్ఎం సంపత్ తదితరులు ఉన్నారు.



ఎండీఎం నిర్వాహకులతో మాట్లాడుతున్న సత్తెనపల్లి డెప్యూటీ డీఈఓ ఏసుబాబు

లైసెన్సుల్లేని ఎరువుల విక్రయాలు నిలిపివేత

క్రోసూరు: ఎరువుల సోర్సు ఆఫ్ సప్లయి లైసెన్సులు లేని కారణంగా సోమవారం రెండు టన్నుల ఎరువుల(రూ.12 వేలు విలువ చేసేవి) విక్రయాలు నిలిపివేసినట్లు పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి సీహెచ్ రవికుమార్ తెలిపారు. సోమవారం క్రోసూరులోని పలు ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారులు, క్రోసూరు ఏడీఏ వి.హనుమంతరావు, ఏవో వేణుగోపాల్‌తో కలిసి తనిఖీ చేశారు. క్రోసూరులోని సాయి వెంకటలక్ష్మి ఫెర్టిలైజర్స్, వేంకటేశ్వర ఫెర్టిలైజర్స్, జయశంకర్ ఏజెన్సీస్ షాపులను తనిఖీచేశారు. తనిఖీలలో లైసెన్సుల్లేని ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. నిబంధనలు పాటించాలని దుకాణాల యజమానులను ఆదేశించారు.



ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న జిల్లా ఏడీఏ సీహెచ్ రవికుమార్, క్రోసూరు అధికారులు

ఎన్‌సీసీతో ఎంతో మేలు



సీ సర్టిఫికెట్లను అందుకున్న క్యాడెట్స్‌తో ఎన్‌సీసీ అధికారులు



ఎన్‌సీసీ క్యాడెట్స్ కోలాట ప్రదర్శన

నరసరావుపేట రూరల్: క్రమ శిక్షణ అలవర్చుకునేందుకు ఎన్‌సీసీ దోహదపడుతోందని గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎమ్ చంద్రశేఖర్ తెలిపారు. ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా చంద్రశేఖర్, 23వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్, కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడారు. ఎన్‌సీసీ ప్రాధాన్యాన్ని వివరించారు. మార్చి-24లో నిర్వహించిన సీ-సర్టిఫికెట్ ఫలితాలలో ఉత్తీర్ణులైన క్యాడెట్లకు అతిథులు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. సీ సర్టిఫికెట్ పూర్తిచేసుకున్న క్యాడెట్స్‌కు రూ.15వేలు విలువచేసే చెక్క రైఫిల్స్‌ను యాజమాన్యం అందించింది. అనంతరం ఎన్‌సీసీ డే సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన క్యాడెట్స్‌కు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డ్రిల్స్‌తో పాటు ఫోక్‌సాంగ్స్, సీనియర్ కాడెట్ కావేరి బృందం చేసిన కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్ పాల్గొన్నారు.